అధ్వానంగా అంబాపురం డ్రైనేజీ వ్యవస్థ

- అవస్థలు పడుతున్న గ్రామస్తులు
- కాల్వలు లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్య
- అవుట్‌ఫాల్ డ్రెయినేజీలోకి మురుగు పంపాలని వినతి



అంబాపురం గ్రామంలోని కాల్వల్లో పారుదల లేని మురుగు

విజయవాడరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగునీటి ప్రవాహం లేక కాల్వలు దారుణంగా తయారయ్యాయి. ప్రత్యేకించి ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ నగరాన్ని ఆనుకొని ఉన్న అంబాపురంలో డ్రెయినేజీలు దయనీయంగా ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 7 వేల మందికిపైగా జనాభా ఉన్న గ్రామంలో పక్కా కాల్వలు నిర్మించకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుంది. దీంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

మురుగునీరు వర్షం నీటితో కలిసి రోడ్లపై ప్రవహిస్తోందని, దీంతో బయటకు రాలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నగరానికి సమీపంలో అంబాపురం గ్రామం ఉండటంతో వ్యాపారాలు చేసుకొనే వారు, గృహాలు నిర్మించుకునే వారు, అపార్టుమెంట్ల నిర్మాణం కోసం స్థలాలు కొనుగోలు చేసి అలాగే ఖాళీ ఉంచడంతో వర్షాలు కురిసిన ప్రతిసారీ వర్షం నీరు ఖాళీ స్థలాల్లో రోజుల తరబడి నిలబడి ఉంటుంది. దీంతో దోమలు ఉధృతి పెరిగి అనేక వ్యాధులకు కారణమవుతున్నాయని జనం ఆవేదన చెందుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు కాల్వలను శుభ్రం చేయడం లేదని, కనీసం సున్నం, బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు లేవని స్థానికులు అంటున్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఖాళీ స్థలాల్లో మురుగు....

అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థకు తోడు ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, ఖాళీ స్థలాలు మెరక చేయించాలని ప్రజలు అనేక దఫాలు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరు నెలలో సంభవించిన బుడమేరు వరదలు అంబాపురం గ్రామంలో ప్రవహించి దాదాపు 15 రోజుల పాటు వేలాది మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నారు. ఆ సందర్భంలో పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆ వరదల్లో ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించి వెళ్లారే తప్ప రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణానికి చర్యలు చేపట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అంబాపురం గ్రామంలోని మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక ఎక్కడ నీరు అక్కడే నిల్వ ఉంటుంది. హోసన్న ప్రార్థన మందిరం సమీపం నుంచి విజయవాడ నగర పాలక సంస్థ నిర్మిస్తున్న అవుట్‌పాల్ డ్రెయినేజీలోకి మురుగును పంపించాలని స్థానికులు అధికారులకు విన్నవించుకుంటున్నారు. ఒకటో వార్డులోని పది అడ్డరోడ్లుల్లో దాదాపు 3200 మంది నివసిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కాల్వల నిర్మాణంపై దృష్టి పెట్టాలి



గ్రామంలో కాల్వలు లేక పోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిల్వ ఉంటుంది. దాని వలన ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు కాల్వలు నిర్మించడంపై దృష్టి పెట్టాలి.

–బాలు మహేంద్ర, అంబాపురం

మురుగు బయటకు పోయే మార్గం చూడాలి



అంబాపురం ఒకటవ వార్డులోని మురుగు బయటకు పోయే మార్గం చూడాలి. ఈ ప్రాంతం పల్లంగా ఉండటం వల్ల మురుగునీరు వెళ్లే అవకాశం లేదు. పైగా ఖాళీ స్థలాల్లో నిల్వ వున్న నీరు రోజులు తరబడి అలాగే ఉండటంతో దోమలు ఉధృతంగా పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. తక్షణమే కాల్వలు నిర్మించాల్సిన అవసరం ఉంది.

–డాక్టర్ రాథోడ్

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం



పైపులరోడ్డు సమీపంలోని ఒకటో వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు గ్రామ పంచాయతీ సమావేశంలో తీర్మానించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి గ్రాంటు విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం రోడ్లకు ప్యాచ్ వర్కులు చేస్తున్నాము.

–డి .శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

క్లుప్తంగా

అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం జిల్లా అధ్యక్షుడిగా పువ్వాడ

కంకిపాడు: అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడుగా కంకిపాడుకు చెందిన పువ్వాడ కృష్ణమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కౌశిక ప్రసాద్ చేతులమీదుగా సోమవారం నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బ్రాహ్మణ మహాసంఘం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. బ్రాహ్మణుల సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పువ్వాడ కృష్ణమోహన్‌ను అభినందించారు.

గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని ఉపాలయంలో గోదాదేవి అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునక్షత్రం సందర్భంగా ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యావచనం జరిపారు. అనంతరం 27 లీటర్ల గోక్షీరం, పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో స్నపన తిరుమంజనం చేశారు. భక్తులచే సామూహిక కుంకుమార్చనలు, తిరుప్పావై ప్రబంధ పారాయణం, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ అర్చకులు ఎస్. రామాచార్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



పెనమలూరు: యనమలకుదురు డొంక రోడ్డులో ఆక్రమణలను రెండవ రోజు కూడా తాడిగడప మున్సిపాలిటీ తొలగించింది. డొంక రోడ్డులో దుకాణాల వద్ద యజమానులు రహదారి పైకి చొచ్చుకు వచ్చి ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రతి దుకాణం ముందు షెడ్లు, ఇతర నిర్మాణాలు చేయటంతో డొంక రోడ్డులో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. డొంక రోడ్డు నుంచి యనమలకుదురు లాకుల వద్దకు రావాలంటే చాలా ట్రాఫిక్‌గా ఉంటుంది. ఆక్రణలు రోడ్డు వరకు రావటంతో తరచుగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. స్థానికులు ఫిర్యాదుతో తాడిగడప మున్సిపాలిటీ అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణల తలగింపు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆత్కూరు(గన్నవరం): ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై సోమవారం ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన మతిస్థిమితం లేని వ్యక్తి పెద్దఆవుటపల్లి హైవే అండర్ పాస్ వద్ద ఆదివారం మూర్ఛవచ్చి పడిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు అతనిని అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున అతను మృతి చెందినట్లుగా ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9491152837లో సంప్రదించాలని కోరారు.

పంచ జ్యోతిర్లింగ దర్శనం, అంబేడ్కర్ యాత్ర

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో భారత దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ఐదు జ్యోతిర్లింగాలను దర్శనంతో పాటు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యాత్ర పేరుతో భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలును సికింద్రబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా ప్రారంభించారు. ఆగస్టు 16 నుంచి 24వ తేదీ వరకు ఎనిమిది రాత్రుళ్లు, తొమ్మిది పగలు సాగే ఈ యాత్రలో నాగ్‌పూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన ప్రదేశమైన దీక్షా భూమి, శ్రీ స్వామి నారాయణ మందిరం దర్శనం, ఉజ్జయినిలోని మహాకాళేశ్వర జ్యోతిర్లింగం, ఓంకారేశ్వర జ్యోతిర్లింగ దర్శనం, అంబేడ్కర్ జన్మస్థలం భీమ్ జన్మభూమి, నాసిక్‌లోని త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం, పూణేలోని భీమశంకర్ జ్యోతిర్లింగం, ఔరంగాబాద్‌లోని గ్రిష్ణేశ్వర జ్యోతిర్లింగ దర్శనం కల్పించారు. ఈ ప్యాకేజీలో స్లీపర్ క్లాస్‌లో ఒక్కొక్కరికి పెద్దలకు రూ. 14,700, పిల్లలకు రూ.13,700, 3 ఏసీ క్లాస్‌లో పెద్దలకు 22,900, పిల్లలకు రూ.21,700, 2 ఏసీలో పెద్దలకు రూ.29,900, పిల్లలకు రూ. 28,400 ధర నిర్ణయించారు.

ఎరువులు పుష్కలంగా సరఫరా చేయాలి



మాట్లాడుతున్న వి.శివశంకర్‌రావు, నరేష్

కంకిపాడు: ఎరువులు పుష్కలంగా సరఫరా చేయాలని కౌలురైతు సంఘం, రైతు సంఘ నేతలు డిమాండ్ చేశారు. పట్టణంలోని మండేపూడి భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతు సంఘం మండల కార్యదర్శి వి.శివశంకర్‌రావు, కౌలురైతు సంఘం నేత టి.నరేష్ మాట్లాడుతూ మండలంలోని పది సొసైటీలు ఉంటే రెండు సొసైటీల్లో మాత్రమే ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ఎరువులు చాలా అవసరమన్నారు. ఎరువుల కోసం సొసైటీలు, బయటి మార్కెట్‌లో షాపులు చుట్టూ రైతులు తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న, సన్నకారు రైతులకు కనీసం ఎరువులు అందని దుస్థితి నెలకొందని ఆరోపించారు. బ్లాక్‌మార్కెట్‌కు ఎరువులు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీకే విక్రయాలు జరిగేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఎరువుల సమస్యను తీర్చకపోతే రైతుసంఘం, కౌలురైతు సంఘాల నేతృత్వంలో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం పతనం తప్పదు



మాట్లాడుతున్న నరసింహారావు

పెనమలూరు: విద్యుత్ స్మార్ట్ మీటర్లతో కూటమి ప్రభుత్వం పతనం తప్పదని, ప్రజల పై ఆర్థిక భారం మోపటానికి చర్యలు చేపట్టిందని, దీనిని ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వై.నరసింహారావు అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఐక్యవేదిక సదస్సు పోరంకిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు తాము అధికారంలోకి వస్తే అమలు చేయమని చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేష్ ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. లోకేష్ ఏకంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగుల కొట్టాలని పిలుపు కూడా ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను లోకేష్ ప్రకటనతో పగుల కొట్టాలా అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లతో కూటమి ప్రభుత్వం పతనం తప్పదని హెచ్చరించారు. పెనమలూరు నియోజకవర్గ కన్వీనర్లు మున్నంగి నరసింహారావు, మోతుకూరి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా విద్యుత్ చార్జీల భారం మోపిందని విమర్శించారు. వారం రోజుల పాటు ప్రజాభిప్రాయం సేకరించి ఆగస్టు 5వ తేదీన సచివాలయాలు, విద్యుత్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందచేస్తామన్నారు. ఈ సదస్సులో ఐక్యవేదిక నేతలు మాగంటి హరిబాబు, షేక్.కాశిం, పంచకర్ల రంగారావు, లక్ష్మి, పలువురు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో చిన్నారులకు పతకాలు



పతకాలు సాధించిన చిన్నారులతో స్విమ్మింగ్‌కోచ్ నవీన్

కంకిపాడు: 9వ ఎంపిఏ ఏపి ట్రయాథిల్–2 టెట్రాతియాన్ రాష్ట్ర చాంపియన్ షిప్ పోటీల్లో చిన్నారులు సత్తా చాటారు. ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ గంగూరులోని బ్లూమింగ్‌డేల్ స్కూల్‌లో రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. అండర్ 13 బాలుర విభాగంలో నాగదేశి రితివ్క్ మిక్స్‌డ్ రిలేలో బంగారు పతకం, ట్రయాథిల్‌లో కాంస్య పతకం సాధించాడు. అండర్–11 బాలికల విభాగంలో నాగదేశి నేహాన్య మిక్స్‌డ్ రిలేలో రజత పతకం, గుడిపూడి సన్విత షారోన్, మిక్స్‌డ్ రిలేలో కాంస్యం, ట్రయాథిల్‌లో రజతం సాధించింది. అండర్–11 బాలుర విభాగంలో గుడిపూడి కృపాసాహిత్ ట్రయాథిల్‌లో బంగారు పతకం, మిక్స్‌డ్ రిలేలో కాంస్యం దక్కించుకున్నాడు. కేవీఎస్ఎస్ విరాట్ కార్తికేయ ట్రయాథిల్‌లో కాంస్యం గెలుచుకున్నాడు. విజేతలను ఈడుపుగల్లు స్విమ్మింగ్ కోచ్ ఎ.నవీన్, అథ్లెటిక్స్ కోచ్ వరలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. పరుగుపందెం, లేజర్ షూటింగ్, స్విమ్మింగ్ విభాగాల్లో జరిగిన పోటీల్లో చిన్నారులు సత్తా చాటారని వివరించారు.

వ్యభిచార వ్యాపారంపై ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): పెద్దాపురంలో యువతులను వ్యభిచార వ్యాపారంలోకి దింపుతున్న ముఠాలపై చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించాలని అత్యాచార వ్యతిరేక పోరాట ఐక్యవేదిక నాయకులు డి.రమాదేవి డిమాండ్ చేశారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పెద్దాపురంలో బాధిత మహిళ కేసులో ప్రభుత్వం ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేసిందని, పెద్దాపురంలో వ్యభిచార గృహాలపై దాడులు చేసి మూడు కేసులు నమోదు చేయడాన్ని ఐక్యవేదిక స్వాగతిస్తోందన్నారు.

అండర్‌పాస్ లేక అవస్థలు

- జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- ఎంతో కాలంగా ప్రజల విజ్ఞప్తి
- అధికారులు స్పందించాలని వినతి



అండర్ పాస్ లేక రాంగ్ రూట్‌లో ప్రయాణాలు చేస్తున్న వాహనదారులు



జాతీయ రహదారిపై అండర్ పాస్ నిర్మించాలని ప్రజలు కోరుతున్న ప్రదేశం

గన్నవరం రూరల్: విజయవాడ-ఏలూరు నేషనల్ హైవే-16 పై చిన అవుటపల్లి వద్ద జాతీయ రహదారుల శాఖ అండర్ పాస్ నిర్మించాలని ఎంతో కాలంగా విజ్ఞప్తి చేస్తున్నారు. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఇక్కడే ఉంది. దానికి అనుబంధంగా బోధనాస్పత్రి ఉంది. దీంతో పాటు డెంటల్ కళాశాల, నర్సింగ్ స్కూల్, కళాశాల ఉన్నాయి. ఈ ఆస్పత్రికి రోజుకు 900 మంది ఔట్ పేషంట్లు వస్తుంటారు. మెడికల్ విద్యార్థులు, నర్సింగ్, డెంటల్, పారా మెడికల్ కోర్సులు విద్యార్థులు చదువుకుంటారు. అంతేగాక మరోవైపు చినఅవుటపల్లి గ్రామం ఉంది. ఈ గ్రామంలో సుమారు 2వేల మంది నివసిస్తున్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన ప్రదేశంలో అండర్ పాస్ నిర్మాణం తప్పని సరి అయింది. సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం, విద్య కోసం వచ్చే వారు దూరంగా ఉన్న పెద అవుటపల్లి అండర్ పాస్ నుంచి తిరిగి రాలేక జాతీయ రహదారి దాటే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన అవుటపల్లి గ్రామానికి, మెడికల్ కళాశాలకు కలిపి ఈ ప్రాంతంలో జాతీయ రహదారుల శాఖ అండర్ పాస్ నిర్మించాలని ఇప్పటికే గ్రామ పంచాయతీ, మెడికల్ కళాశాల యాజమాన్యం వినతి పత్రాలు అందజేసింది. హైవే బైపాస్ పూర్తి కానున్న దశలో ఈ అండర్ పాస్ కూడా నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అండర్ పాస్ నిర్మిస్తే ప్రమాదాలు నివారించటంతో పాటు రోగులకు ఇబ్బందులు తప్పుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. పెద అవుటపల్లి వరకూ వెళ్లి తిరిగి వచ్చేందుకు రెండు కిలో మీటర్లకు పైగా అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. అంబులెన్స్ సైతం ఇదే విధంగా సేవలందిస్తోంది. ప్రయాణం దూరం కావటంతో ఉదయం నుంచి వాహనదారులు రాంగ్ రూట్‌లో మెడికల్ కళాశాల, ఆస్పత్రికి ప్రమాదకరంగా ప్రయాణాలు చేస్తున్నారు.

వేలాది మందికి మేలు



చిన అవుటపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి పై అండర్ పాస్ నిర్మించాలి. దీంతో గ్రామస్తులకు, వైద్యం కోసం వచ్చే వేలాది మంది రోగులకు, సందర్శకులకు, వైద్య విద్యార్థులకు మేలు కలుగుతుంది.

– మల్లంపల్లి ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి

అండర్ పాస్ నిర్మాణం తప్పనిసరి



చిన అవుటపల్లి వద్ద ప్రమాదాలు నివారణకు జాతీయ రహదారిపై అండర్ పాస్ నిర్మాణం తప్పనిసరి. జాతీయ రహదారుల శాఖ పనులు చేస్తున్న నేపథ్యంలో ఇప్పుడే చర్యలు తీసుకుంటే బాగుంటుంది. అందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది.

– మిరప నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు

మహిమాన్వితం వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభం

- ఆగస్టు 1న జెండా మహోత్సవం
- అంగరంగ వైభవంగా నిర్వహణ
- పూర్తవుతున్న ఏర్పాట్లు



వీరబ్రహ్మేంద్రస్వామి వారి ధ్వజస్తంభం

కంకిపాడు: వీర బ్రహ్మేంద్రస్వామి వారి ధ్వజస్తంభం...మహిమానిత్వం...కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువు...విజయాలను సిద్ధించే జయ ధ్వజస్తంభం ...జెండా మహోత్సవానికి ముస్తాబైంది. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆగస్టు ఒకటిన వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభంపై జెండా తొడిగే మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలో 1835వ సంవత్సరంలో శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ధ్వజస్తంభమును బ్రహ్మశ్రీ లంకెలపల్లి రామబ్రహ్మయోగీంద్రులుచే స్థాపించారు. 1925 మే 15న సంభవించిన భారీ ఉప్పెన గాలితో ధ్వజస్తంభం శిథిలమైంది. దీంతో 1935 మే 27న వల్లభాపురపు వీరాచార్యులు, పర్వతనేని చినకామయ్య చౌదరి, మేడూరి వెంకటాచార్యులు, గ్రామస్తుల సహాయ సహకారాలతో ధ్వజస్తంభం పునఃప్రతిష్ట చేశారు.

90 అడుగుల భారీ ధ్వజస్తంభం....

రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో మాత్రమే వీరబ్రహ్మేంద్రస్వామి వారి ధ్వజస్తంభాలు ఉన్నాయి. ఏలూరు, జగ్గయ్యపేట ప్రాంతాలతో పాటు ఈడుపుగల్లు. మరెక్కడా లేని విధంగా 90 అడుగుల ఎత్తున భారీ ధ్వజస్తంభం గ్రామంలో నెలకొల్పారు. అప్పట్లో ఏటిపాయలో పడవలు, ఆ తర్వాత ఎడ్లబండ్లపై ధ్వజస్తంభాన్ని తీసుకొచ్చి ప్రతిష్ఠించినట్లుగా గ్రామస్తులు చెబుతారు. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ధ్వజస్తంభం విరాజిల్లుతోంది. ఆనాడు టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు సైతం గ్రామం వచ్చినప్పుడు ఈ ధ్వజస్తంభానికి పూజలు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు, జెండా మహోత్సవం.....

మహిమాన్వితమైన వీరబ్రహ్మంద్రే స్వామి వారి ధ్వజస్తంభానికి పూజలు చేస్తే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. అందులోనూ ఏటా వచ్చే శ్రావణమాసం రెండో శుక్రవారం ధ్వజస్తంభంపై జెండా తొడిగితే వారి కోర్కెలు నెరవేరుతాయని, అన్నింటా విజయం సిద్ధిస్తుందని నమ్మకం ప్రజల్లో ఉంది. గతంలో మూడేళ్లకు ఒకసారి శ్రావణమాసం రెండో శుక్రవారం ధ్వజస్తంభంపై జెండా తొడిగి ప్రత్యేక పూజలు నిర్వహించేవారు. అయితే జెండా తొడిగి, మొక్కులు చెల్లించే భక్తుల సంఖ్య క్రమంగా పెరగటంతో ప్రతి సంవత్సరం శ్రావణమాసం రెండో శుక్రవారం జెండా మహోత్సవం జరిపిస్తున్నారు. తొలుత ప్రత్యేకంగా రూపొందించిన జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించిన, అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగించి ధ్వజస్తంభంపై జెండా తొడగటం ద్వారా ఉత్సవం ముగుస్తుంది.

దేవస్థానాలు ముస్తాబు...

ఈ ఏడాది శ్రావణమాసం రెండో శుక్రవారం ఆగస్టు 1న వచ్చింది. ఈ సందర్భంగా జెండా మహోత్సవానికి ఏర్పాట్లు చేశారు. ధ్వజస్తంభం చుట్టూ కర్రలతో ప్రత్యేకంగా అడితి నిర్మించారు. ఉత్సవాల్లో కీలకమైన అడితి పూర్తి చేయటంతో పాటుగా గ్రామంలోని శివాలయం, ఆంజనేయ స్వామి దేవస్థానాలను ముస్తాబుచేశారు. ఈ ఏడాది ముసునూరు బాల మన్మధరావు, శ్రీలక్ష్మి దంపతుల చేతులమీదుగా జెండా మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా గ్రామంలోని కామేశ్వర వీరభద్రస్వామి వార్ల దేవస్థానంలో ఆగస్టు 1న తెల్లవారుఝాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం జెండా తొడిగే మహోత్సవం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక గుడివాడరోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. బాపులపాడుకు చెందిన గొట్టిపాటి వెంకట కృష్ణ (56) ఈ నెల 26వ తేదిన గుడివాడరోడ్డులో నడుచుకుంటూ వెళుతుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన మినీ వ్యాన్ అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటకృష్ణను కుటుంబ సభ్యులు విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. మహదేవపురం సబ్‌స్టేషన్ పరిధిలో తులసీనగర్, సనత్‌నగర్ ఫీడర్లు మరమ్మతులు కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. దీని కారణంగా పంటకాలువ రోడ్డు, తులసీనగర్, సనత్ నగర్, మహదేవపురంకాలనీ, వరలక్ష్మిపురం, శ్రీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



పెనమలూరు: గోసాల గ్రామంలో ప్రధాన రహదారి పనులు ప్రారంభించామని వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ గ్రామపంచాయతీ జనరల్ ఫండ్స్ రూ.40 లక్షలతో గ్రామంలో వేణుగోపాలస్వామినగర్ నుంచి వైకుంఠపురం వరకు దాదాపు 300 మీటర్ల సీసీరోడ్డు, డ్రెయిన్ పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. చాలా కాలంగా ఈ రోడ్డు పనులు పై ప్రతిపాదనలు ఉండగా గ్రామస్తుల అభ్యర్థన మేరకు గ్రామ పంచాయతీ నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టామన్నారు. త్వరలో రోడ్డు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బ్యానర్లు తొలగింపుపై వివాదం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు కట్టిన బ్యానర్లు తొలగించడంపై వివాదం నెలకొంది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో పలు గ్రామాల్లోని నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ కట్టిన బ్యానర్లను టీడీపీ నాయకుల ఒత్తిడితో ఆయా పంచాయతీ అధికారులు కట్టిన కొద్ది సేపటికే తొలగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు పంచాయతీ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి సిబ్బందిచే తొలగింపజేశారు.

నిర్లక్ష్యం చేస్తే హెపటైటీస్ ప్రాణాంతకం

లబ్బీపేట(విజయవాడతూర్పు): హెపటైటీస్‌ను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు అన్నారు. ప్రపంచ హెపటైటీస్ దినోత్సవం సందర్భంగా ఎస్పీఎం విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఏడుకొండలరావు మాట్లాడుతూ.. వైరల్ హెపటైటీస్ వ్యాప్తి, ప్రమాద కారకాలు, లక్షణాలు, వైద్య పరీక్షలు, చికిత్స, స్క్రీనింగ్, నివారణ వంటి అంశాలను వివరించారు. చేతుల శుభ్రత, శుభ్రమైన ఆహారం తీసుకోవడం, నిల్వచేసిన ఆహారం తినకుండా ఉండటం, రక్త సంబంధిత పదార్థాలను ముట్టకుండా ఉండటం, రక్త బదిలీలో జాగ్రత్తలు, టీకాల ద్వారా హెపటైటీస్ వ్యాప్తి, కాలేయ క్యాన్సర్ నివారణపై ప్రసంగించారు.